సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 20 । జనవరి । 2023



నల్లమలకు తగ్గని రద్దీ

ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు, రంగాపూర్ ఉర్సుతో నల్లమలలో రద్దీ నెలకొంది.

వివరాలు 8లో ▸



రసవత్తరంగా క్రికెట్ పోటీలు

గద్వాలలో ప్రైమ్ మినిస్టర్ కప్ టీ–20 క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.2 /16.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి ప్రభావం ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు, రేపు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, స్త్రీ–శిశు సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు, 21వ తేదీన సాంఘిక సంక్షేమం, నిర్మాణం–పనులు, ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని రాజాబహదూర్‌రెడ్డి కన్వెన్షన్ సెంటర్ ఆవరణలో యోగి వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సాధారణ మానవుడిగా జీవనయానం సాగించి, యోగిగా మారిన వేమన జ్ఞానభాస్కరుడిని, సామాజిక ధర్మాలతోపాటు వేదాంత రహస్యాలను సులభశైలిలో చాటిచెప్పిన సంఘ సంస్కర్త అని అన్నారు. వచ్చే ఏడాది యోగి వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని కోరారు. కార్యక్రమంలో సంపాదకులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి రాఘవారెడ్డి, కార్యదర్శి జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి నలమద్ది సురేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమాదేవి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోకు సంబంధించి ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సమస్యలను 9959226286 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆమె సూచించారు.

గిరిజన డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్: మాచారం వద్ద ఉన్న నాగర్‌కర్నూల్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నిరీక్షణ్ రావు సూచించారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మార్చి 5న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి తెప్పోత్సవం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ సమీపంలో ఉన్న పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను తెప్పలో ఉంచి భక్తుల నారసింహస్వామి నామస్మరణ మధ్య విహరింపజేశారు. అంతకు ముందు వేదపండితులు స్వామివారికి అభిషేకోత్సవం, నిత్యహోమం, గణపతి నవగ్రహ సర్వతోభద్రవాహనములు నిర్వహించారు. గరుడవాహన సేవ, జంటసేవ, అనంతరం పారువేట పద్యపఠనం నిర్వహించి, మంగళహారతి తో ముగించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆదిత్య లక్ష్మణరావు, వేదపండితులు సంపత్‌కుమార్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

6,062 మందికి పరీక్షలు

తొలిరోజు కంటి వెలుగు విజయవంతం

- జిల్లాలో 45 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభం
- 1,535 మందికి అద్దాలు పంపిణీ, 1,071 మందికి దూరచూపు అద్దాలు ఆర్డర్
- కార్యక్రమం ప్రారంభోత్సవంలో జెడ్పీచైర్‌పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు



శివశక్తినగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావ్

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమం మొదటి రోజు జిల్లాలో విజయవంతంగా ముగిసింది. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మొత్తం 45కేంద్రాల్లో నేత్రపరీక్షలు చేపట్టారు. మున్సిపాలిటీ వార్డుల్లో, గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు జిల్లాకేంద్రంలో 10 వార్డులలో, జడ్చర్ల మున్సిపాలిటీలో రెండు వార్డులు, భూత్పూర్ ఒక వార్డులో శిబిరాలు నిర్వహించారు. శివశక్తినగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావ్, జడ్చర్లలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అడ్డాకులలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఇతర ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. హన్వాడ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అమిస్తాపూర్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సీతారామారావు తనిఖీ చేశారు. టంకరలో ఏర్పాటు చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ పరిశీలించారు.

■ జిల్లాలో మొదటిరోజు 45 బృందాలు కలిపి 6,062 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, దగ్గరి చూపు సమస్య ఉన్న 1,535 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. దగ్గరి, దూరం చూపు సమస్య ఉన్న వారిని 1,071 మందిని గుర్తించి వీరికి ప్రత్యేకంగా ఆర్డర్ పెట్టి అద్దాలు తయారు చేయిస్తున్నారు. 45 బృందాల పనితీరును పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటుతో పాటు రెండు బఫర్ టీంలు ఏర్పాటు చేశారు.

■ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పది వార్డుల్లో నిర్వహించిన కంటి వెలుగు పరీక్షల్లో 1,411 మందికి పరీక్షలు నిర్వహించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో 211 మందికి కంటి పరీక్షలు చేయగా 41 మందికి దగ్గరి చూపు కంటి అద్దాలు అక్కడే అందజేశారు. దగ్గరి, దూరం చూపు సమస్య ఉన్న 61 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టారు. హన్వాడ మండల పరిధిలో మూడు బృందాల ద్వారా 429 మందికి పరీక్షలు చేయగా 178 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. గంగాపూర్‌లో 126మందికి పరీక్షలు చేసి 15మందికి అద్దాలు ఇవ్వగా మరో 20మందికి అర్డర్ పెట్టారు. మొదటి రోజు అత్యధికంగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 23 వార్డులోని పాత పాలమూరులో 241మందికి పరీక్షలు చేయగా అత్యల్పంగా అయ్యవారిపల్లిలో 58 మందికి పరీక్షలు చేశారు. అదేవిధంగా అద్దాలు అత్యధికంగా టంకరలో 108 మంది, అత్యల్పంగా అయ్యవారిపల్లిలో నలుగురికి ఇచ్చారు.

■ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, అందరూ కలిసి సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. పాత పాలమూరు అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలోని శివశక్తినగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకే ప్రజలందరూ కంటి పరీక్షల కోసం కేంద్రాలకు రావడం సంతోషకరమన్నారు. 15 రోజులుగా జిల్లా యంత్రాంగంతో పాటు అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కంటి వెలుగులో గుర్తించిన వారికి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్దదని, ఈ విడత కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించినా ఆశ్చర్యపోనక్కలేదన్నారు.

■ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కంటి చూపు లేకుంటే జీవితమే అంధకారమని, కంటి చూపు లోపంతో బాధపడే ప్రజల కళ్లలో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల్లో ప్రజలు కంటి చూపు మందగించినప్పటికీ ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసి చికిత్స చేసుకునే అవకాశం లేక అలాగే ఉండిపోతున్నారని తెలిపారు. జిల్లావాసులు ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ కంటి ప్రాముఖ్యత గుర్తించి కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారని తెలిపారు. అనంతరం కంటి పరీక్షల విధానం పరిశీలించడంతో పాటు కంటి పరీక్షలు చేసుకున్న కొందరికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, కౌన్సిలర్ తిరుపతమ్మ, నోడల్ అధికారులు మోతీలాల్, వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు కంటి పరీక్షలు ఇలా.. (పీహెచ్‌సీ, యూహెచ్‌పీల వారీగా)

పీహెచ్‌సీ	ప.చే.వా.	అ.తీ.	అ.రె.	పీహెచ్‌సీ	ప.చే.వా.	అ.తీ.	అ.రె.
జానంపేట	366	125	42	ఎదిర	431	139	130
గంగాపూర్	241	42	37	నవాబ్‌పేట	376	74	69
పేరూర్	160	18	22	మహమ్మదాబాద్	238	36	47
మోతీనగర్	224	72	63	బాలానగర్	431	76	31
గండేడ్	190	44	47	దేవరకద్ర	203	36	22
భూత్పూర్	296	39	57	కుమ్మరివాడి	298	135	84
రాజాపూర్	150	30	35	అడ్డాకుల	190	39	9
కోత్లాబాద్	299	29	39	హన్వాడ	429	178	56
మణికొండ	256	33	44	రామయ్యబౌళి	279	154	64
మిడ్జిల్	140	36	48	పాతపాలమూరు	412	110	17
జడ్చర్ల	211	44	65	చిన్నచింతకుంట	242	46	54

ప.చే.వా.: పరీక్షలు చేయించుకున్నవారు అ.తీ.: అద్దాలు తీసుకుంది అ.రె.: అద్దాలకు రెఫర్



హన్వాడలో శిబిరాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ తేజస్‌నందులాల్ పవర్



జడ్చర్లలో కంటి వెలుగు శిబిరంలో ఓ మహిళ కంటిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉగాదిలోగా కళాభారతి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ ఆవరణలో చేపట్టిన కళాభారతి పనులను తనిఖీ చేశారు. పనులను వేగవంతం చేసి ఉగాది నాటికి పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సంసిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాభారతి నిర్మాణానికి ఉపయోగిస్తున్న స్టీలు, సిమెంట్ ఇతర సామగ్రిని పరిశీలించి వాటి వివరాలను కాంట్రాక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ రహనుమియా బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అందువల్ల సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైతే ఎక్కువ సామగ్రిని ఎక్కువ లేబర్, మిషనరీ వినియోగించాలని ఎస్‌హెచ్ అధికారి డిప్యూటీ ఇంజినీర్ రమేష్‌ను ఆదేశించారు. అక్కడి నుంచి కలెక్టర్ ట్యాంక్ బండ్‌పై నిర్మిస్తున్న నెక్లెస్ రోడ్డు పనులు, ఇతర పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాల్సిందిగా ఎస్ఈ చక్రధర్, డీఈ మనోహర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ సంధ్య, ఏఈ ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ పార్థసారథి ఉన్నారు.

ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలి

- ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌రెడ్డి

జడ్చర్ల: ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని తెలంగాణ యూఐడీఏఐ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌రెడ్డి తెలిపారు. గురువారం జడ్చర్లలోని ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులు తీసుకుని పదేళ్లు పూర్తయిన వారు తిరిగి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. తమ ఆధార్ కార్డులపై జారీ చేసిన తేదీని సరి చూసుకొని గడువు దాటిన వారందరూ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. త్వరలోనే అప్‌డేట్‌కు సంబంధించి వెబ్‌సైట్ లింక్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వస్తామని, దాని ద్వారా అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆధార్ నమోదు అప్‌డేట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాహుల్, ఆధార్ నమోదు కేంద్రం నిర్వాహకుడు రఫీక్ పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ వాల్‌పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌రెడ్డి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంధ్యారాణి

పాలమూరు: జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి గురువారం ఓబ్లాయిపల్లిలో ఉన్న రామకృష్ణ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆ తర్వాత రాంరెడ్డి గూడెంలో ఉన్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదవడంతో పాటు జీవితంలో ఏర్పాటు చేసుకున్న లక్ష్యం చేరుకోవాలన్నారు. అమ్మాయిలు, బాలికలు ఏదైనా ఆపద కానీ ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తుంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల ఇబ్బందులను అధిగమించడానికి అవకాశం ఉంటుందన్నారు.

■ జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవన్‌లో గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు, కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్ కేసులు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ పిటిషన్ కేసులు, కార్మికశాఖలో ఉన్న కేసులు, రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉంటే వాటిని రాజీ చేసుకోవడానికి కక్షిదారులను లోక్ అదాలత్‌కు వచ్చే విధంగా చూడాలన్నారు.

నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

స్టేషన్ మహబూబ్‌నగర్: పోలీస్ నియామకాల్లో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంతకుముందు నాయకులు బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్ మాట్లాడుతూ పోలీస్ నియామకాల్లో జరిగిన తప్పులను సరిచేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ నియామకాల్లో అన్యాయం జరిగిందని కొంతమంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ.కోటి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఉద్యోగాల కల్పనలో నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. యువత సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు యువజన కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. యువత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అనంతరం వివిధ సమస్యలపై కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శులు అనిల్‌రెడ్డి, ఆంజనేయులు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ సల్మాన్, నాయకులు బాలయ్య, గోపాల్, ఇమ్రాన్, అఫ్రోజ్, జహీర్, అస్గర్‌పాష, ముస్తాన్, యాసిన్, జహంగీర్, ఆదిల్, అక్రం, రిజ్వాన్, ఫసి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

వేరుశనగ క్వింటాల్ రూ.8,218

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకు గరిష్టంగా రూ.8,218, కనిష్టంగా రూ.6,169 ధరలు లభించాయి. అదేవిధంగా కందులు గరిష్టంగా రూ.7,067, కనిష్టంగా రూ.6,709, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,301, కనిష్టంగా రూ.2,255, ధాన్యం ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,361, కనిష్టంగా రూ.2,086, పొద్దుతిరుగుడు గరిష్టంగా రూ.5,210, కనిష్టంగా రూ.5,052, ఆముదాలు రూ.6,171 ధరలు లభించాయి.

సోనామసూరి ధర రూ.2,371

దేవరకద్ర మార్కెట్‌లో గురువారం జరిగిన ఈ–నామ్ టెండర్లలో సోనామసూరి వరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,371, కనిష్టంగా రూ.2,129గా ధరలు నమోదయ్యాయి. కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,100, కనిష్టంగా రూ.6,929గా ధరలు లభించాయి. కొద్ది మొత్తంలో వచ్చిన ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,260గా ఒకే ధర వచ్చింది. సీజన్ లేకపోవడంతో ధాన్యం కూడా తక్కువగానే వచ్చింది.

మారిన యాక్షన్ ప్లాన్

- మహిళా సంఘాలకు పెరిగిన రుణ లక్ష్యం
- అదనంగా మరో రూ.69.77 కోట్లు పెంపు
- మార్చి లోగా ఇవ్వాల్సిన రుణాలు రూ.389.18 కోట్లు



జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో హాజరైన సంఘం సభ్యులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహిళా సంఘాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం రుణాలు ఇస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల జనవరితో కలిపితే మూడు నెలలు మాత్రమే ఉంటుంది. శాఖ ఆధ్వర్యంలో నిర్ణయించిన రుణ లక్ష్యం దాదాపుగా పూర్తి కావాలి. అలాంటి సమయంలో ప్రభుత్వం అదనంగా మరో 69.77 కోట్ల లక్ష్యాన్ని పెంచింది. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో కొత్తగా లక్ష్యం పెంచడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వారికి రుణాలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఏడాదికి ఏడాది రుణ లక్ష్యం పెంచుకుంటూ పోతుంది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి రూ.259.24 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇది 2020–21 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.71 కోట్లు అధికం. అదేక్రమంలో ఈ ఆర్థిక సంవత్సరం కూడా అదనంగా రూ.60.17 కోట్లు ఇవ్వాలని నిర్దేశించారు. జిల్లాలో మహిళా సంఘాలు ప్రభుత్వ లక్ష్యానికి మించి రుణాలు పొందుతున్నారు. దీంతో వారు ఆర్థిక పరిపుష్టి సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో మొత్తంగా 1,64,400 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాల్లో 15 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. 629 గ్రామైక్య సంఘాలు ఉండగా 16,440 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 790 సంఘాలకు రూ.29.13 కోట్లు ఉండగా ప్రస్తుత లక్ష్యం రూ.34.93 కోట్లుగా నిర్దేశించారు. మహమ్మదాబాద్‌లో 531 సంఘాలకు రూ.15.32 కోట్లు ఉండగా రూ.15.33 కోట్లు, హన్వాడకు 820 సంఘాలకు రూ.26.13 కోట్లు ఉండగా రూ.30.45 కోట్లు, నవాబుపేటలో 836 సంఘాలకు రూ.30.85 కోట్లు ఉండగా రూ.34.87 కోట్లకు పెంచారు. అలాగే భూత్పూర్‌లో 460 సంఘాలకు రూ.14.12 కోట్లు ఉండగా రూ.15.58 కోట్లు, మూసాపేటలో 351 సంఘాలకు రూ.15.37 కోట్లు ఉండగా రూ.22.20 కోట్లు, దేవరకద్రలో 592 సంఘాలకు రూ.18.17కోట్లు ఉండగా రూ.21.33 కోట్లు, అడ్డాకుల 359 సంఘాలకు రూ.12.54 కోట్లు ఉండగా రూ.12.84 కోట్లు, బాలానగర్‌లో 620 సంఘాలకు రూ.20.33 కోట్లు ఉండగా రూ.22.49 కోట్లు, సీసీ కుంటలో 769 సంఘాలకు రూ.27.15 కోట్లు ఉండగా రూ.52.35 కోట్లు, గండేడ్‌కు 615 సంఘాలకు రూ.19.52 కోట్లు ఉండగా రూ.19.52 కోట్లు, కోయిల్‌కొండకు 974 సంఘాలకు రూ.20.47 కోట్లు ఉండగా రూ.20.92 కోట్లు, మిడ్జిల్‌కు 437 సంఘాలకు 18.10 కోట్లు ఉండగా రూ.22.57 కోట్లు రుణ లక్ష్యం నిర్ణయించారు.

ఇప్పటిదాకా రూ.235.65 కోట్ల రుణాలు

2022–23 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన సమయంలో రూ.319.41 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మొత్తం 9,548 స్వయం సహాయ సంఘాలకు రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. డిసెంబర్ నెల నాటికి రూ.235.65 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు ఇచ్చారు. 4,033 సంఘాలకు చెందిన మహిళలు రుణాలు పొందారు.

ప్రభుత్వం ఆదేశాల మేరకు..



మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తుంది. ఈ ఏడు మొదట రూ.319.41 కోట్లు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. డిసెంబర్‌లో మరో రూ.69.77 కోట్లు కలిపి రూ.389.18 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రుణ లక్ష్యాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తాం. – యాదయ్య, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


వసురాంనాయక్ (ఫైల్)

కోడేరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కోడేరు మండలంలో చోటుచేసుకుంది. రేకులపల్లి తండాకు చెందిన వసురాంనాయక్(60) తన వ్యవసాయ పొలంలో బోరుమోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య మణెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తి..


రమేష్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: బొలెరో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మల్కాపూర్‌గేట్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా గోడుకుంట్ల గ్రామానికి చెందిన రమేష్(29) తన అన్న నెలమాసికం కోసం ద్విచక్రవాహనంపై వనపర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో మల్కాపూర్ గేటు వద్ద ఎదురుగా వచ్చిన బొలెరో ఢీకొనడంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..

కోడేరు: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కావలి లింగయ్య(70) గ్రామానికి దగ్గరలోని వ్యవసాయ పొలం వద్ద మృతిచెందాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబ సభ్యులు రోదిస్తూ.. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. మృతుని తొడలు, మర్మాంగాల వద్ద గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు తన భర్తను చంపారని భార్య నర్సమ్మ రోదిస్తూ తెలియజేసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోయిల్‌కొండ: మండలంలోని కోత్లాబాద్‌కి చెందిన ఎక్కరాజు(38) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎక్కరాజు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై రోజూ తాగి ఇంటికి వస్తున్నాడు. దీంతో ఈ నెల 16న భార్య భాగ్యమ్మ భర్తతో రోజూ ఎందుకు తాగి వస్తున్నావని వాదించి, అదే రోజు కూలి పనికి వెళ్లింది. భార్య పనికి వెళ్లగానే భర్త ఇంట్లోని పురుగు మందు తాగాడు. కుమార్తె రాజమణి చూసి తల్లి భాగ్యమ్మకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆమె భర్తను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ.. బుధవారం రాత్రి మృతిచెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

నల్లమలకు తగ్గని రద్దీ

- ఉమామహేశ్వరంలో భక్తుల సందడి
- నిరంజన్‌షావలి దర్గాలో జారత్ నిర్వహణ

అచ్చంపేట: ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు, రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా ఉర్సు వేడుకల్లో గురువారం కూడా భక్తుల సందడి కనిపించింది. నల్లమల కొండలపై వెలసిన శ్రీపార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న వేడుకలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాపనాశిని గుండం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని, అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తున్నారు. ఈనెల 16న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, బుధవారం రంగాపూర్ దర్గాతండాలో ఉన్న దర్గాలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల భక్తులే గాక ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. అత్యధికులు హిందువులే కావడం విశేషం. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, కందూరులు, ఫతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

శేషవాహన సేవ..

నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతున్నారు. గురువారం మధ్యాహ్నం ప్రదోశకాలంలో జరిగిన శేషవాహన సేవలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు శేషవాహనంలో స్వామి వారు ఊరేగింపు సాగింది. వేదపడింతుల మంత్రోచ్ఛరణల మధ్య భజనబృందం సంకీర్తనలు పాడారు. భక్తుల జయ,జయ ధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

జారత్...

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 11గంటలకు నిరంజన్‌షావలీ దర్గా ఆవరణలోని మసీదులో కమిటీ అధ్యక్షుడు అమీనోద్దీన్ ఆధ్వర్యంలో జారత్ నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం జారత్ గానం చేశారు.


ఉమామహేశ్వర ంలో భక్తులు


ఉమామహేశ్వరంలో శేషవాహన సేవలో పాల్గొన్న భక్తులు


రంగాపూర్ ఉర్సులో భక్తుల సందడి


నిరంజన్‌షావలీ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


ఉమామహేశ్వరంలో ముస్లింలు

ఉర్సులో రెట్టింపు ధరలు

- టెంకాయ ఒకటి రూ.60 నుంచి రూ.80
- కార్లు, జీపులు, ట్రాక్టర్ల పార్కింగ్‌కు రూ.250 వసూలు

అచ్చంపేట: రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు వద్ద వ్యాపారులు రెట్టింపు ధరలు అమలుచేస్తున్నారు. అధికారుల సాక్షిగా చెప్పిందే ధర అన్నట్లు వ్యవహరిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తుల వద్ద కొబ్బరికాయలు, తైబజారు పేరిట వాహనాల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ ఉర్సు రంగాపూర్, దర్గతండా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ రెండు పంచాయతీలు తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవరిస్తున్నాయి. జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఉర్సులో భక్తితో కొట్టే కొబ్బరికాయను రెట్టింపు ధరకు అమ్ముతూ భక్తుల జేబులు గుల్ల చేస్తున్నారు. అక్రమార్కులకు ఉర్సు వేదికగా మారింది. టెండరు సమయంలో కొబ్బరికాయ, ధర రూ.40లకు విక్రయించేందుకు టెండరుదారుడు అధికారుల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. కానీ అందుకు భిన్నంగా రూ.60 నుంచి రూ.80లకు ఒక టెంకాయ విక్రయిస్తున్నారు. పలువురు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇదే టెంకాయలను ఉమామహేశ్వరం క్షేత్రంలో రూ.30 అమ్ముతున్నారు. అధికారులు కూడా టెండరుదారునికి మద్దతుగా నిలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో వాహనానికి తైబజార్ పొందిన కాంట్రాక్టర్లు రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

వేతన వెతలు


అచ్చంపేటలోని రక్తనిధి కేంద్రం

- రక్తనిధి కేంద్రాల్లో సిబ్బందికి అందని వేతనాలు
- 10 నెలలుగా బకాయి
- ఆందోళన చెందుతున్న సిబ్బంది

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రక్తనిధి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 10 నెలలుగా వేతనాలు అందడం లేదు. 16 ఏళ్లుగా పని చేస్తున్నా పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని.. పనిభారం ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు తమ గోడును వెలిబుచ్చినా పట్టించుకోవడం లేదని.. ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బంది భావిస్తున్నట్లు తెలుస్తోంది.

2006లో ప్రారంభం..

రూరల్ చైల్డ్ హెల్త్ ప్రాజెక్టు కింద తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో 9 బ్లడ్‌బ్యాంకులు, 31 స్టోరేజ్ సెంటర్లు పని చేస్తున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆర్‌సీహెచ్ ప్రాజెక్టును 2006లో ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం 2017, మార్చి 31తో ముగిసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఈ ప్రాజెక్టును 2017, జూలై 1న ఆధీనంలోకి తీసుకొని సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. రక్తనిధి కేంద్రాల్లో నిల్వలు తగ్గితే శిబిరాలు నిర్వహించి సేకరిస్తుంటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు ఉచితంగా అందిస్తుండగా.. ప్రైవేట్ ఆస్పత్రులకు 300 ఎంఎల్‌కుగాను రూ.1,050 విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లాలోని వనపర్తిలో 8 మంది, నాగర్‌కర్నూల్‌లో అయిదుగురు, గద్వాలలో అయిదుగురు, నారాయణపేటలో ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. 2006లో ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.3 వేలు, ల్యాబ్ అసిస్టెంట్లకు రూ.2 వేల చొప్పున వేతనాలు చెల్లించేవారు. ప్రస్తుతం ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.20,200, అసిస్టెంట్లకు రూ.14,450 చెల్లిస్తున్నారు. సిబ్బంది 12 గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో మూడునెలలకు ఓసారి వేతనాలు చెల్లిస్తుండగా.. ఈసారి 10 నెలలైనా అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. చాలీచాలని వేతనాలు ఉండటం, నెలనెలా చెల్లించకపోవడంతో ఆందోళన చేస్తున్నామని, రోగులకు ఇబ్బందులు కలగకుండా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సిబ్బంది చెబుతున్నారు.

త్వరలోనే చెల్లింపులు..



వేతనాల చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలో ఉంది. త్వరలోనే అందిస్తాం. అతి త్వరలో అచ్చంపేటలో బ్లడ్‌బ్యాంకును ప్రారంభించనున్నాం. అన్ని పనులు చకచకా జరుగుతున్నాయి.

– రమేష్‌చంద్ర, కో–ఆర్డినేటర్, నాగర్‌కర్నూల్

కంటివెలుగులో అపశృతి

- కంటి పరీక్షల కోసం వచ్చిన వ్యక్తి ఫిట్స్‌తో మృతి


మొగులాలు(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: కంటివెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షల నిమిత్తం వచ్చిన వ్యక్తి పరీక్షల అనంతరం ఫిట్స్‌తో మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని దేశిటిక్యాలలో గురువారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దేశిటిక్యాలకు చెందిన మొగులాలు(45) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఇతను గ్రామంలో నిర్వహించిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నాడు. అనంతరం అక్కడే కూర్చోగా.. అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు కంటివెలుగు వాహనంలో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఇదివరకే అనారోగ్య సమస్యలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరించారు.

భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

మరికల్: మద్యానికి బానిసై.. డబ్బుల కోసం భార్యను చంపిన కేసులో భర్తకు గురువారం నారాయణపేట కోర్టు జీవితఖైదీగా జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మరికల్‌కు చెందిన సీమ నాగమణెమ్మ(30) ఇంటి ముందు మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు మే 2019లో ఇతరులతో రూ.5 వేలు అప్పుగా తీసుకొని ఇంట్లో దాచింది. భార్యకు తెలియకుండా భర్త సీమ రాములు ఆ డబ్బులను తీసుకెళ్లి రెండు రోజులు మద్యం తాగి ఖర్చు చేశాడు. ఈ విషయమై భార్య భర్తను నిలదీయగా మద్యం మత్తులో ఉన్న భర్త ఇంట్లో ఉన్న గ్యాస్‌ను తెచ్చి భార్యపై పోసి నిప్పంటించాడు. తీవ్రంగా కాలిన ఆమెను హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయమై జిల్లా జడ్జి నాగమణెమ్మతో మరణ వాంగ్మూలం తీసుకోగా.. అప్పటి సీఐ ఇఫ్తేకార్ అహ్మద్, ఎస్‌ఐ జానకిరాంరెడ్డి నిందితుడిపై కేసు నమోదు చేశారు. సాక్ష్యాలను ప్రస్తుత ఎస్‌ఐ అశోక్‌బాబు జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా సెషన్స్ జడ్జి రఫీ పైవిధంగా తీర్పు ఇచ్చారు. కేసులో ఇన్వెస్టిగేషన్ చేసి సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వరిలో కాండంతొలుచు పురుగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్ ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరిలో నారునుంచి పైరు పాలు పోసుకునే దశ వరకు కాండం తొలిచే పురుగు ఆశిస్తోంది. ఇది సోకిన ప్రాథమిక దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ పురుగునే మొవ్వ పురుగు అంటారని తెలిపారు. ఈ పురుగు ఆశిస్తే తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

పురుగు జీవితచక్రం..

తల్లి పురుగు కనీసం 300 గుడ్ల వరకు పెడుతుంది. ఒక్కోగుంపులో 20 నుంచి 80 గుడ్లు ఉంటాయి. ఈ గుడ్లు 5 నుంచి 7 రోజులు పొదిగి పురుగులు బయటికి వస్తాయి. లార్వా దశ పూర్తికాలం 30 నుంచి 40 రోజులు ఉంటుంది. పూర్తి జీవితచక్రం 70 రోజుల్లో పూర్తవుతుంది.

నారుమడి నుంచే జాగ్రత్తలు..

నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడికి 170 గ్రాములు చొప్పున నీటిలో ఇసుక కలిపి నారుమడిలో చల్లుకోవాలి. నారు నాటేటప్పుడు నారు చివర్లు తుంచి వేయాలి.

పంటలో నివారణ చర్యలు..

వరి పిలకలు తొడిగే దశలో లీటరు నీటికి 2 మి.లీ క్లోరోఫైరిపాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. అంకురం దశలో 10 నుంచి 15 రోజుల సమయంలో ఎకరానికి 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలి. పురుగు మందులైతే క్లోరో ఫైరిపాస్ 2 మి.మీ, అసిఫేట్ 1.5 గ్రాములు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.


వరి కాండాన్ని తొలిచే పురుగు

నష్టపరిచే విధానం..

- చిరు పొట్ట ఏర్పడిన తర్వాత పురుగు ఆశిస్తే వెన్నులో నుంచి గింజలకు పోషకాలు అందక అవి తాలుగా మారుతాయి.
- తల్లి రెక్కల పురుగు గుడ్లను ఆకు చివరిపై భాగంలో గుంపులుగా పెట్టి ఉదరం చివర గల వెంట్రుకలతో కప్పి ఉంచుతుంది.
- ఈ పురుగులు గుంపులుగా మొక్కపైభాగంలో చేరి ఆకు తొడిమపై నున్న పత్రహరితాన్ని గోకి తింటాయి.
- పూర్తిగా ఎదిగిన పురుగు వరి కాండంలో కోశస్థ దశకు చేరుకుంటాయి.
- పైరు పిలకలు వేసే దశలో గుడ్ల నుంచి వెలుబడిన వెంటనే మొదట దశ పిల్ల పురుగులు ఆకు కొమ్మకు చేరుకుని అక్కడ పత్రహరితాన్ని గోకి తింటాయి.
- పంటల్లో ఈ పురుగు చేసే నష్టం వలన మొక్క ఆకులు తెల్లని చారలుగా ఏర్పడతాయి.
- ఈ పురుగు కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినటం వలన మువ్వ ఆకులు విడిపడక మువ్వ కోళ్లు ఏర్పడుతుంది.


కాండం తొలుచు పురుగు ఆశించన వరి పంట

ఏడు ఇసుక టిప్పర్లు సీజ్



కోయిల్‌కొండ: మండలంలోని సూరారం వాగు నుంచి మహబూబ్‌నగర్‌కు గురువారం సాయంత్రం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ఇసుక టిప్పర్లను పట్టుకొని సీజ్ చేశామని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ బృందంతో కలిసి వెళ్లారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు బెంజ్ లారీలు, నాలుగు టిప్పర్లు పట్టుబడ్డాయని చెప్పారు. వెంటనే ఆ వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు.

మరణంలోనూ తోడుగా..

- గుండెపోటుతో తమ్ముడు మృతి
- అంత్యక్రియలకు వచ్చి గుండె పగిలి అక్క మరణం

ధన్వాడ: గుండెపోటుతో తమ్ముడు మృతిచెందగా.. అంత్యక్రియలకు వెళ్లిన అక్క సైతం గుండె పగిలి మృతిచెందింది. ఈ హృదయవిదారక సంఘటన నారాయణపేట జిల్లాకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. నారాయణపేటకు చెందిన బోగం శేఖర్(50) బుధవారం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈ విషయం కొల్లంపల్లిలో నివాసం ఉంటున్న శేఖర్ అక్క మాకం లక్ష్మి (52) తెలియజేయడంతో గురువారం అంత్యక్రియల కోసం నారాయణపేటకు వచ్చింది. ఈ క్రమంలో తమ్ముడి మృతదేహాన్ని చూసి తట్టుకోలేక గుండెపోటుతో కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. తమ్ముడు, అక్క ఆకస్మిక మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ముందుగా తమ్ముడి అంత్యక్రియలు నారాయణపేటలో, తర్వాత లక్ష్మి అంత్యక్రియలను కొల్లంపల్లిలో నిర్వహించారు.


మాకం లక్ష్మి (ఫైల్)


బోగం శేఖర్ (ఫైల్)

గంజాయి కేసు కుట్ర భగ్నం

- ముగ్గురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

మహబూబ్‌నగర్ క్రైం: పాత కక్ష్యలు దృష్టిలో పెట్టుకుని గంజాయి కేసులో ఇరికించాలని చేసిన కుట్రను టాస్క్‌ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం మద్దూరు మండలంలోని దోరెపల్లిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్‌కు చెందిన పాత గంజాయి నేరస్థులు ఎండీ రహమాత్, చిలుకు బాబురావు, దోరెపల్లికి చెందిన అంజయ్యలను అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి 1,300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిని కోస్గి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఈఎస్ సైదులు తనిఖీల వివరాలు వెల్లడించారు. దోరెపల్లిలో చేసిన తనిఖీల్లో 1,300 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందని, ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు పటేల్ రాజేశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు చెప్పారు. దోరెపల్లికి చెందిన బాల్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన పటేల్ రాజేశ్వర్‌రెడ్డిలకు ఉన్న భూ పంచాయితీలు, పాత కక్ష్యలను దృష్టిలో పెట్టుకుని బాల్‌రెడ్డిని గంజాయి కేసులో ఇరికించాలని పటేల్ రాజేశ్వర్‌రెడ్డి కుట్ర చేశాడని వెల్లడించారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట పటేల్ రాజేశ్వర్‌రెడ్డి చెక్‌బౌన్స్ కేసులో మహబూబ్‌నగర్ జైలులో ఉన్న సమయంలో తనతోపాటు జైలులో ఉన్న చిలుకు బాబురావుతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత పటేల్ రాజేశ్వర్‌రెడ్డి రూ.1,300 నగదును చిలుకు బాబురావుకు ఇచ్చి ఎండు గంజాయి తీసుకురావాలని కోరాడు. చిలుకు బాబురావు గంజాయి కోసం ఎండీ రహమత్‌ను సంప్రదించి ఇద్దరూ కలిసి 1,300 గ్రాముల ఎండు గంజాయి తీసుకుని పటేల్ రాజేశ్వర్‌రెడ్డికి ఇవ్వడానికి గురువారం దోరెపల్లికి వచ్చారన్నారు. వాళ్లు తీసుకువచ్చిన 1,300 గ్రాముల ఎండు గంజాయిలో 1,100 గ్రాముల గంజాయిని అంజయ్య సహాయంతో బాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో పెట్టి మిగిలిన 200 గ్రాములతో చిలుకు బాబురావు, రహమాత్, అంజయ్యలు తిరిగి వెళ్తుండగా దాడి చేసి పట్టుకున్నారన్నారు. ప్రధాన నేరస్థుడు పటేల్ రాజేశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నాడని ఈ నలుగురిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. తనిఖీల్లో సీఐ వీరారెడ్డి, ఎస్‌ఐ నరేష్‌రెడ్డి, సిబ్బంది రియాజ్, కృష్ణయ్య, రామచంద్ర, రమేష్, ఎలియా పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సారా విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో బుధవారం రాత్రి ఎక్సైజ్ సిబ్బంది గ్రామానికి చేరుకొని సారా విక్రయిస్తున్న యనమల చెన్నమ్మ, చంద్రయ్య, బక్కమ్మలను పట్టుకొని 16 లీటర్ల సారాతో కల్వకుర్తి స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకటేష్, దిలీప్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. సారా తయారీ, అమ్మకం, మరియు రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

'బీఆర్‌ఎస్ సభలో కానరాని బీజేపీ వ్యతిరేక ఎజెండా'

ఖమ్మం సహకారనగర్: దేశ సంస్కృతి, సంపదతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు, వ్యవస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎజెండా ప్రకటిస్తారని జరిగిన ప్రచార ఆర్భాటానికి తగ్గట్టుగా ఖమ్మం బీఆర్‌ఎస్ సభ లేదని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఎద్దేవా చేశారు. కనీసం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పనికొచ్చే ఎజెండా కూడా లేదని అన్నారు. గురువారం ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాల సీఎంలను తీసుకొచ్చి ఆర్భాటంగా నిర్వహించిన సభలో దేశానికి దశ దిశ ఇచ్చే ఎజెండా లేకపోవడం, ప్రజలు ఆశించినవి కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. పోడుపట్టాలు, పేదలకు ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సింగరేణి ప్రైవేటీకరణ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ వంటి హామీల ఊసెత్తలేదని ఆరోపించారు. జాతులు, కులాలు, ప్రాంతాలు, మతాల పేరిట ప్రజలను విభజించి, విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీని కట్టడి చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని భట్టి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు తమతో కలిసి ప్రయాణం చేస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30న శ్రీనగర్‌లో ముగుస్తున్న నేపథ్యంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు విక్రమార్క వెల్లడించారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని మీడియా సాక్షిగా ఆహ్వానిస్తున్నట్టు భట్టి తెలిపారు. ఆయన కాంగ్రెస్‌లోకి రావడానికి తాను అడ్డుగా లేనని చెప్పారు.

కేసీఆర్ ప్రసంగం హాస్యాస్పదం: పొన్నాల

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సుమారు రూ. 5 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీయించిన సీఎం కేసీఆర్ దేశం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయిని తీస్తానన్నట్టుగా కేసీఆర్ మాటలున్నాయని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో సీఎం గొప్పలు చెప్పుకొనేందుకే తాపత్రయపడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో 17 లక్షల మంది దళితులుంటే కేవలం 30 వేల మందికే దళితబంధు పథకాన్ని అమలు చేస్తూ దేశమంతా దీన్ని వర్తింపజేస్తానని సీఎం మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చి కొత్త ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతున్నారని ఆక్షేపించారు.

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి...

మరో రూ. 16వేల కోట్లు!

దావోస్ వేదికగా నగరంలో భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించిన ఐటీ దిగ్గజం

- కొత్తగా మరో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ సమక్షంలో వెల్లడి
- గతేడాది రూ.16 వేల కోట్లతో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటన
- తాజా నిర్ణయంతో రెట్టింపు కానున్న మైక్రోసాఫ్ట్ పెట్టుబడి

సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో మరో భారీ పెట్టుబడికి ముందుకొచ్చింది. గత సంవత్సరం ప్రారంభంలో రూ. 16 వేల కోట్ల పెట్టుబడితో ఒక్కోటీ సగటున 100 మెగావాట్ల ఐటీలోడ్ (సర్వర్లు, నెట్‌వర్క్ పరికరాలు వినియోగించిన లేదా వాటి కోసం కేటాయించే విద్యుత్ మొత్తం)తో 3 డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన మైక్రోసాఫ్ట్ తాజాగా దావోస్ వేదికగా మరో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావుతో జరిగిన సమావేశంలో ఈ మేరకు మైక్రోసాఫ్ట్ తమ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. కొత్తగా ప్రకటించిన 3 డేటా సెంటర్ల ఏర్పాటుకు మరో రూ. 16 వేల కోట్లు వెచ్చించే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఉన్న పెట్టుబడి అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మొత్తంగా 6 డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. రాబోయే 10–15 ఏళ్లలో ఈ డేటా సెంటర్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగిస్తాయని పేర్కొంది. క్లౌడ్ ఆధారిత మౌలిక వసతులను పెంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకే ఈ భారీ పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ వివరించింది.



మైక్రోసాఫ్ట్‌తో బంధం బలోపేతం: కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఉన్న బంధం తాజా పెట్టుబడితో మరింత బలోపేతం అవుతుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ, క్లౌడ్ అడాప్షన్ వంటి అంశాల్లో ఇప్పటికే మైక్రోసాఫ్ట్‌తో కలసి పనిచేస్తున్నట్లు చెప్పారు. మైక్రోసాఫ్ట్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 6 డేటా సెంటర్లు హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కావడం సంతోషకరమన్నారు. తెలంగాణ కేంద్రంగా మైక్రోసాఫ్ట్ మరింత అభివృద్ధి చెందాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఇంత భారీ పెట్టుబడితో హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్నందుకు మైక్రోసాఫ్ట్‌కు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. మైక్రోసాఫ్ట్ ఆసియా హెడ్ అహ్మద్ మజారీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ మార్కెట్‌లో హైదరాబాదే కీలకమని, భవిష్యత్తులోనూ మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. భారత్ కేంద్రంగా తమ సంస్థ చేపట్టే పలు ప్రాజెక్టులకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు కీలకంగా మారతాయన్నారు.

హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో 'వెబ్‌పీటీ' కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఔట్ పేషెంట్ రిహాబిలిటేషన్ థెరపీకి అవసరయ్యే సాఫ్ట్‌వేర్ సేవలను అందించడంలో అంతర్జాతీయంగా పేరున్న వెబ్‌పీటీ సంస్థ హైదరాబాద్‌లో రూ. 150 కోట్లతో గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేయనుంది. 2008లో అమెరికాలోని ఫీనిక్స్ కేంద్రంగా ప్రారంభమైన వెబ్‌పీటీ సాఫ్ట్‌వేర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సంస్థ తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా మంత్రి కేటీఆర్ బృందంతో సమావేశమైన వెబ్‌పీటీ సీఈఓ యాష్లే గ్లోవర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పాల్ షుగా, సమ్మిట్ కన్సల్టింగ్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సందీప్ శర్మలు ఈ మేరకు ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నందుకు వెబ్‌పీటీకి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. వెబ్‌పీటీ విజయాల్లో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని హామీ ఇచ్చారు. లైఫ్ సైన్సెస్ హబ్ ఆఫ్ ఆసియాగా హైదరాబాద్ ఎదుగుతున్న వైనానికి ఇది మరో నిదర్శనమన్నారు.

రాష్ట్రంలో డబ్ల్యూహెచ్‌వో టీకా కేంద్రం

మీడియా సంస్థల ఇంటర్వ్యూలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కరోనా మహమ్మారి వల్ల వైద్య రంగంలో ఉన్న లోపాలు ప్రపంచవ్యాప్తంగా కనిపించాయన్నారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో తమ దగ్గర కావాల్సినన్ని వెంటిలేటర్లు లేవని న్యూయార్క్ గవర్నర్ అన్నారని, ఆ పరిస్థితుల్ని అంచనా వేస్తే లైఫ్ సైన్సెస్‌కు పెద్దపీట వేయాలన్న ఆలోచన కలిగిందన్నారు. ఈ మేరకు చేసిన కృషి వల్ల ప్రపంచంలోకెల్లా మూడో వంతు వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. తెలంగాణలోనే 40 శాతం ఫార్మసీ ఉత్పత్తులు తయారవుతున్నాయని చెప్పారు. కరోనా తరహాలో మరే ఇతర మహమ్మారులు వచ్చినా ఎదుర్కొనే రీతిలో టీకాలు అవసరమని గుర్తించి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్ల ఉత్పత్తి విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థను సంప్రదించామని, అందుకు ఆ సంస్థ కూడా ఆసక్తి ప్రదర్శించిందని... త్వరలోనే తెలంగాణలో ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్ హబ్‌ను డబ్ల్యూహెచ్‌వో ఏర్పాటు చేయబోతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అత్యధిక వృద్ధి రేటు తెలంగాణలోనే..

దేశంలో అత్యధిక వృద్ధి రేటు తెలంగాణలోనే ఉన్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. కోవిడ్ ఉన్నా.. నోట్ల రద్దు చేసినా.. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ రాష్ట్రం వృద్ధి రేటులో దూసుకువెళ్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్రంలో సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 15 శాతంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ కేంద్రం తమకు సహకరించి ఉంటే తెలంగాణ మరింత వేగంగా వృద్ధి సాధించేదని పేర్కొన్నారు. తెలంగాణ తరహాలో ఇతర రాష్ట్రాలన్నీ పనిచేసుంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే రూ. 5 లక్షల కోట్ల మార్కును దాటేదన్నారు.

మోదీ సర్కార్ అప్పు రూ.100 లక్షల కోట్లు..

మోదీ ప్రధాని కావడానికి ముందు దేశ అప్పు రూ. 56 లక్షల కోట్లుగా ఉండగా మోదీ పాలనలో దేశం కొత్తగా రూ. 100 లక్షల కోట్ల మేర అప్పులపాలైనట్లు మంత్రి కేటీఆర్ ఆరోపించారు. గత 8 ఏళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఖజానాకు పన్నుల రూపంలో రూ. 3.68 లక్షల కోట్లు అందించినా తమ ప్రభుత్వానికి కేంద్రం నుంచి వచ్చింది కేవలం రూ. 1.68 లక్షల కోట్లేనని కేటీఆర్ తెలిపారు.



ప్యానెల్ డిస్కషన్‌లో కేటీఆర్

పరస్పర సహకారంతో సమస్యలకు పరిష్కారం

బయోటెక్ విప్లవంపై దావోస్ చర్చా వేదికలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సైన్స్‌కు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఎన్నో సమస్యలకు సులువైన పరిష్కారం లభిస్తుందని మంత్రి కె. తారక రామారావు అన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశానికి హాజరైన ఆయన బయోటెక్నాలజీ పరిణామ క్రమం (విప్లవం)పై జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ఉద్యోగ కల్పనలో దాని సామర్థ్యంపై తన ఆలోచనలను పంచుకున్నారు. మెరుగైన, కచ్చితమైన ఔషధాల తయారీతోపాటు ఆరోగ్య సంరక్షణలో మరిన్ని సురక్షిత పద్ధతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనలో నెలకొన్న లోపాలు కోవిడ్ వ్యాప్తితో బయటపడ్డాయని, పరస్పర సహకారం లేకుంటే ఎలాంటి సమస్య కూడా పరిష్కారం కాదన్న సత్యాన్ని కోవిడ్ తెలియచేసిందన్నారు. ప్రభుత్వ విధానాలు రూపొందించే నాయకత్వం, ప్రముఖ బయోటెక్నాలజిస్టులు, సాంకేతిక సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాన్ని ప్రపంచ ఆర్థిక వేదిక కల్పిస్తుందన్న విశ్వాసం తనకు ఉందన్నారు.

'ఎంవీ యాక్ట్'లో 6 నెలల నిబంధన

అమానుషం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాద పరిహార కేసుల్లో బాధిత కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన 6 నెలల్లోనే దావా వేయాలన్న మోటారు వాహన చట్ట నిబంధనను హైకోర్టు తప్పుబట్టింది. ప్రమాదంలో ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబం కోలుకోవడానికే సంవత్సరానికిపైగా సమయం పడుతుందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధన అమానుషమని పేర్కొంది. ఈ నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకారి)గా న్యాయవాది పి.శ్రీరఘురామ్‌ను నియమిస్తున్నామని స్పష్టం చేసింది. నిబంధనలను పరిశీలించి ఏం చేయాలన్న దానిపై నివేదిక అందజేయాలని ఆయన్ను ఆదేశించింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం అమ్రాడ్ గ్రామానికి చెందిన అయిటి హనుమాండ్లు గతేడాది ఏప్రిల్ 15న తన భార్య నవనీత సహా ఇద్దరు మైనర్ కుమారులతో కలసి ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలవగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక కుమారుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో తమ కుమారుడి మరణానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడి నుంచి పరిహారం కోరుతూ నిజామాబాద్ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో గతేడాది నవంబర్ 10న హనుమాండ్లు పిటిషన్ వేశారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి 6 నెలలు దాటడంతో పిటిషన్‌ను స్వీకరించేందుకు ట్రిబ్యునల్ నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టుకెక్కారు.

ఢిల్లీ ప్రోగ్రామింగ్ కమిటీ ఇన్‌చార్జిగా కర్రి వేణుమాధవ్: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ప్రోగ్రామింగ్ కమిటీ ఇన్‌చార్జిగా కర్రి వేణుమాధవ్‌ను సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ ఉద్యమాలలో వేణుమాధవ్ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. భవిష్యత్ బీసీ ఉద్యమానికి ఢిల్లీ వేదికగా మారనుందని, జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలను సమన్వయ పర్చడంలో, కార్యక్రమాలు నిర్వహించడంలో తనకు వేణుమాధవ్ అండదండలు అందిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 8, 9 తేదీలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషిచేయాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు వేణుమాధవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అసోం యువకుడి సైకిల్ యాత్ర



అడ్డాకుల: అసోంలోని హేమాజీ జిల్లా లక్కి నేపాలి బస్తీకి చెందిన జంగ్ బహదూర్ చత్రి 2022, నవంబర్ 21న అసోం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల కోసం ఈ యాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అసోం నుంచి పశ్చిమబెంగాల్, సిక్కిం, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కన్యాకుమారికి చేరుకొని తిరిగి అక్కడి నుంచి కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా రాష్ట్రంలోని జాతీయ రహదారిపై సాగుతోంది. ఈ యాత్ర గురువారం మండలంలోని జాతీయ రహదారి మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 58 రోజులుగా యాత్ర కొనసాగుతోందని, ప్రస్తుతం అసోంలో పోలీస్ ఉద్యోగానికిగాను శారీరక పరీక్ష పూర్తి చేసినట్లు వివరించారు. దేశ సైనికులకు తగిన గౌరవం ఇస్తూ వారి సేవలను అందరూ గుర్తించాలని, సైనికుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు.

రామన్‌పాడుకు 950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రజనీల్‌రెడ్డి తెలిపారు.

చెక్‌పోస్టులను శాశ్వతంగా తొలగించాలి

అచ్చంపేట రూరల్: నల్లమలలోని ఉమామహేశ్వరం, మద్దిమడుగు ఆలయాలకు వెళ్లే రహదారుల్లో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను శాశ్వతంగా తొలగించాలని యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ డిమాండ్ చేశారు. గురువారం ఉమామహేశ్వరం సమీపంలో ఉన్న చెక్‌పోస్టును యువసేన ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. ఆలయాలకు వెళ్లే భక్తుల నుంచి డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. నల్లమల పర్యటనకు వస్తున్న దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. హిందూ సమాజంపై రాష్ట్ర ప్రభుత్వం పగ సాధిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో రాచరికపు పాలన



మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

- కట్టడి చేయకపోతే భవిష్యత్ ప్రమాదకరం
- నాగర్‌కర్నూల్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి
- 22న దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి: మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ రాచరికపు పాలన కొనసాగుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. నిజాం కాలంలో రజకార్ వ్యవస్థలాగే బీఆర్‌ఎస్ తయారైందని, కట్టడి చేయకపోతే భవిష్యత్ ప్రమాదకరంగా మారనుందని చెప్పారు. జిల్లాకేంద్రంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిజినేపల్లి మండలం శాయినిపల్లిలో గిరిజన యువకుడిపై దాడి ఘటన హేయమైన చర్యగా అభివర్ణించారు. బీఆర్‌ఎస్ నాయకులు చెప్పు కాలుతో యువకుడి మెడపై తొక్కి చంపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సి ఉండగా, పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు పరిమితం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, సర్పంచులపై దాడుల ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే జైలు భరో కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో పోరాటానికి దిగుతామని స్పష్టం చేశారు.

సభను విజయవంతం చేయండి: నాగం

గిరిజన యువకుడిపై బీఆర్‌ఎస్ నేతలు చేసిన దాడికి నిరసనగా బిజినేపల్లి మండలకేంద్రంలో ఈనెల 22న 'దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ'ను నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరుకానున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సభ ఏర్పాట్లు పర్యవేక్షణకు పార్టీ అధిష్టానం కమిటీని ఏర్పాటు చేసిందని, మండలానికి ఒకరు ఇన్‌చార్జ్ వ్యవహరిస్తారని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ప్రదీప్‌గౌడ్, నర్సింహారెడ్డి, రవళిరెడ్డి, సరిత, పి.విజయారెడ్డి, రోహిణి, కృష్ణయ్య హాజరయ్యారు.

సీనియార్టీ జాబితాలో తప్పులు దొర్లొద్దు

- బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో జాబితా పరిశీలిస్తున్న అధికారులు
- డైట్ కళాశాలలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ దాదాపు ప్రారంభమైనట్లే కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రక్రియకు సంబంధించి శుక్రవారం షెడ్యూల్ విడుదల చేయనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో రూపొందించిన సీనియార్టీ జాబితా వివరాలను ఇప్పటికే బోర్డు నుంచి 3,500 మంది ఉపాధ్యాయుల డాటా జిల్లా విద్యాశాఖ అధికారులకు అందింది. దాని ప్రకారం ఉద్యోగులు, తప్పొప్పులు వివరాలను తేల్చనున్నారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలిస్తున్నారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే సీనియార్టీ జాబితా తదితర అంశాలు పరిశీలించేందుకు సమయం సరిపోకపోవడంతో విద్యాశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అయితే ఈ పరిశీలన పూర్తయిన వెంటనే సీనియార్టీ జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. అనంతరం దీనిపై అభ్యంతరాలను స్వీకరించేందుకు కొంత సమయం ఇవ్వనున్నారు.

పకడ్బందీగా పరిశీలన

సీనియార్టీ జాబితాలో తప్పొప్పులు దొర్లకుండా చూడాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు డైట్ కళాశాలలో పదోన్నతులు, బదిలీలపై వేసిన కమిటీలతో ఆయన గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. బోర్డు నుంచి వచ్చిన డాటాను పరిశీలించి ఉపాధ్యాయుల సర్వీస్ వివరాలను సరిపోల్చాలని సూచించారు. ఇందులో ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. వివరాలు సరిపోలని ఉద్యోగుల వివరాలను తమకు రిపోర్టు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వచ్చేలోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎంఈఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో వివిధ కమిటీలకు సూచనలిస్తున్న డీఈఓ రవీందర్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నందినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గండేడ్: క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రుసుంపల్లి చెందిన నందిని వాలీబాల్ అండర్-19 జాతీయ స్థాయికి అర్హత సాధించింది. ఈసందర్భంగా ఆయన గ్రామానికి చేరుకుని ఆమెను శాలువా, పులమాలలతో సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలన్నారు. కన్నవారితో పాటు పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకువచ్చి మండల ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



బెంగళూరు- బంగ్లాదేశ్ మధ్య కొనసాగుతున్న మ్యాచ్

- సత్తాచాటిన జైపూర్, బెంగళూరు, వీరహనుమాన్ జట్లు

గద్వాల: నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సేవా డేస్ సహకారంతో జోగుళాంబ గద్వాల జిల్లా క్రికెట్ అసోసియేషన్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రైమ్ మినిస్టర్ కప్ టీ–20 అంతర్జాతీయ క్రికెట్ పోటీలు అయిదో రోజుకు చేరుకున్నాయి. ప్రతి మ్యాచ్ హోరాహోరిగా సాగుతుంది. గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌లో నిజాంబాద్– జైపూర్ జట్లు తలపడ్డాయి. బీజేపీ నాయకుడు బండల వెంకట్రాములు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో నిజాంబాద్ జట్టుపై జైపూర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు– బంగ్లాదేశ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బంగ్లాదేశ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు 151 పరుగులకే ఆలౌట్ అయింది. 45 బంతుల్లో 77 పరుగులు చేసిన ఆయుద్ శర్మకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. మూడో మ్యాచ్ హైదరాబాద్– గద్వాల వీరహనుమాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 92 పరుగులకే ఆలౌట్ అయింది. వీరహనుమాన్ బౌలర్ అమిత్ కీలకమైన నాలుగు వికెట్లు తీసి హైదరాబాద్‌ను దెబ్బతీశాడు. తరువాత బరిలోకి దిగిన గద్వాల వీరహనుమాన్ జట్టు 11 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. ప్రతిభ చాటిన అమిత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

సహకార సంఘాల పనితీరుపై అధ్యయనం

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): కరీంనగర్ డీసీసీబీ, ముల్కనూర్, చొప్పదండి పీఏసీఎస్‌లను మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్‌ల నేతృత్వంలో గురువారం సందర్శించారు. ఆ సంఘాల పనితీరుపై అధ్యయనం చేశారు. ఆయా సంఘాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి పాలకవర్గ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. రెండు రోజులు వారు నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి నిర్ణయానికి వచ్చారు. వంద ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గల మహబూబ్‌నగర్ డీసీసీబీ కూడా ఆయా పేరెన్నిక గల సంఘాల సరసన చేర్చేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా, వైస్ చైర్మన్ వెంకటయ్య తదితరులు సమాయత్తమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.1,200 కోట్ల టర్నోవర్‌తో రూ.12 కోట్ల లాభాలతో ఉన్నదని, అయితే గతంలో బ్యాంకు ద్వారా మంజూరు చేసిన రుణాలను రైతులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల నిరర్థక ఆస్తులు పెరిగిపోయాయి. అందువల్ల కొత్తగా రుణాలు ఇచ్చే వీలులేక వ్యాపార అభివృద్ధి కాలేదు. అయితే ఈ బ్యాంకు పునర్‌వైభవం తెచ్చేందుకు గతేడాది పాలకవర్గం, ఉద్యోగస్తులు అందరూ సమష్టిగా కృషి చేసి ఊహించని స్థాయిలో వసూళ్లు చేసి లాభాలు పెంచి నిరర్థక ఆస్తులు తగ్గించారు.



కరీంనగర్ డీసీసీబీ అధికారులతో మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్లు